క్లుప్తంగా

సెబ్ సీఐగా రవీంద్ర

ఆత్మకూరు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆత్మకూరు సీఐగా గుంటూరు జిల్లా వేమూరులో సెబ్ సీఐగా పనిచేస్తున్న కలువ రవీంద్ర బదిలీపై వచ్చారు. ఆయన సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న బి నయన తార నరసారావుపేట సెబ్ సీఐగా బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు, రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో సర్కిల్ పరిధిలోని అన్ని మండలాలను పరిశీలిస్తామని తెలిపారు.

30న మండల సమావేశం

సంగం: సంగం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, తాగునీటి వసతులపై సమీక్ష తదితర అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

బోగోలు మాజీ సర్పంచ్ మణెమ్మ మృతి



బోగిరి మణెమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: బోగోలు మాజీ సర్పంచ్ బోగిరి మణెమ్మ (58) గుండెపోటుతో సోమవారం వేకువన మృతి చెందారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బోగోలుకు చేరుకుని మణెమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, మండల కోఆప్షన్ సభ్యులు నాయబ్ రసూల్, నాయకులు పత్రి అంకులయ్య, తుమ్మల రమణయ్య, పోతల ప్రసాద్, జనపాల గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

10వ తరగతి విద్యార్థులకు విజయదీపిక

సోమశిల: అనంతసాగరం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం పంపిణీ చేశారు. విజయ దీపికలో 10వ తరగతి విద్యార్థులకు సులభమైన ప్రశ్నలు జవాబులు ఉన్నాయని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట: యోగా గురువులుగా ఆసక్తి, అనుభవం ఉన్న పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మండలంలోని చిరమన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ షేక్ రాబియా సోమవారం తెలిపారు. అభ్యర్థులు యోగాలో పీజీ లేదా డిప్లొమా చేసిన వారు అర్హులని, నెలలో పురుషులకు 32 గంటల పనిదినాలు ఉంటాయన్నారు. రూ.8 వేలు జీతం ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు 9849920355 నంబరులో సంప్రదించాలని తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

నేడు ఆత్మకూరులో విజయీభవ యాత్ర

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని 2వ వార్డు పరిధి వెంకట్రావుపల్లి నుంచి విజయీభవ యాత్ర నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వెంకట్రావుపల్లి గిరిజనకాలనీ నుంచి విజయీభవ యాత్ర చేయనున్నట్లు వివరించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

రేపటి నుంచి ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు వింజమూరులో జరగనున్నాయి. ఈ మేరకు వింజమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారు. నియోజకవర్గ స్థాయి విజేత జట్లకు ప్రథమ బహుమతిగా రూ.35 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ఇవ్వనున్నారు. 24వ తేదీ పురుషులకు, 27వ తేదీ మహిళలకు క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. 27వ తేదీ పురుషులకు, మహిళలకు కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. 24వ తేదీ వాలీబాల్ పురుషులకు, మహిళలకు జరుగుతాయన్నారు. 25వ తేదీ పురుషులకు, మహిళలకు ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు.

జగమంతా రామమయం



పూజల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వంగవీటి నరేంద్ర

- జై శ్రీరామ్ నామస్మరణతో దద్దరిల్లిన ఆలయాలు



వరికుంటపాడు: స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్త బృందం

ఆత్మకూరు: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట జరిగిన సమయంలో ఆత్మకూరులోని పలు రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సుందరమ్మ రామాలయం, ఆర్యవైశ్య బజారులోని కోదండ రామాలయం, పంటవీధి, ఎల్‌ఆర్‌పల్లి రామాలయాల్లో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు సామూహికంగా పాలాభిషేకాలు చేయించారు. ఉత్సవమూర్తులను, మూలవిరాట్‌లను సుందరంగా అలంకరించి శ్రీరామ సహస్రనామ పూజలు చేశారు. ఆలయాల్లోనే టీవీలు ఏర్పాటు చేసి అయోధ్యలోని రామమందిరంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాల వినియోగం చేశారు. ఆర్యవైశ్య యూత్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా మున్సిపల్ బస్టాండ్ సెంటర్, సోమశిల రోడ్ సెంటర్, సత్రం సెంటర్ వద్ద భారీ స్థాయిలో అన్నదానాలు చేశారు. పట్టణంలోని పలు ఇళ్లపై హనుమత్ ధ్వజాలు (జెండాలు) ఎగురవేశారు. ఈ పూజల్లో పలు ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా బాలరాముని గ్రామోత్సవం

పట్టణంలోని సత్రం సెంటర్ కోదండ రామాలయంలో విశేష పూజల అనంతరం సోమవారం రాత్రి బాలరాముని ఉత్సవ మూర్తికి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో పట్టణంలో జరిగిన ఈ ఉత్సవాన్ని మహిళలు నిర్వహించడం విశేషం. తమ ఇళ్ల ముందుకు వచ్చిన బాలరాముని ఉత్సవ మూర్తికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు.



అల్లూరు: రామనామ జపంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



సంగం: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆత్మకూరు: ఆర్యవైశ్య బజారులోని రామాలయంలో సామూహిక పాలాభిషేకం చేస్తున్న భక్తులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సంగం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా సంగంలో భక్తులు శోభయాత్రను నిర్వహించారు. పలు ఆలయాల్లో భజనలు, పూజలు చేశారు. భక్తులు రాముల వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

రామనామ సంకీర్తనలు

వరికుంటపాడు: అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సమయంలో వరికుంటపాడులో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకాలు విశేష పూజలు అలంకరణ చేశారు. మహిళలు కలశాలతో చిన్నారులు, యువకులు, సీతారాముల, ఆంజనేయస్వామి జెండాలతో రామనామ సంకీర్తనలు చేసుకుంటూ గ్రామోత్సవం నిర్వహించారు. అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం ఆలయం ఎదుట రంగ వల్లులు వేసి 500 దీపాలు వెలిగించారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు

చేజర్ల: మండలంలోని పలు రామాలయాల్లో సోమవారం శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా పలు రామాలయాల్లో భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆత్మకూరు: బాలరాముని ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మార్మోగిన శ్రీరామ నామ జపం

కావలి: పట్టణంలో సోమవారం శ్రీరామ తారక మంత్రం మారుమోగింది. కొన్ని శతాబ్దాల తర్వాత రాముడు పుట్టిన అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన జరుగుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలో ట్రంకురోడ్డులో కొలువైన రామమందిరంలో భక్తులు రామనామ స్మరణతో పులకరించిపోయారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, విజయవాడకు చెందిన రంగా కుటుంబ సభ్యుడు వంగవీటి నరేంద్రతో కలిసి రామాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. స్థానిక దేవాలయాల్లోనూ రామనామ జపాలు, హోమాలు, ప్రత్యేకంగా నిర్వహించారు. పట్టణంలో సీతారాముల వేషధారణలతో శోభాయాత్ర నిర్వహించారు. రామ నామాంకిత ధ్యానంతో కావలి పరవశించిపోయింది.

ఊరూవాడా రామమయం

ఉదయగిరి: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు చేశారు. వింజమూరులోని గొనుగుంట కల్యాణ మండలంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయ్యప్ప దేవాలయం, దుత్తలూరు సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. బాలరాముడి ప్రతిష్ఠ కార్యక్రమం ప్రత్యక్షంగా టీవీ తెరలపై తిలకించారు. ఉదయగిరిలోని పార్వతి పరమేశ్వర దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

శ్రీరామ నామ సంకీర్తనలు

అల్లూరు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సమయంలో అల్లూరుపేటలోని దత్త సాయిబాబా మందిరంలో శ్రీరామనామ సంకీర్తన నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కోనేరు సెంటర్‌లో అభయాంజనేయస్వామి పుష్కరిణి వద్ద నుంచి రామ మందిరం వరకు రామనామ సంకీర్తనలతో రామ నామ జపంతో జెండాలను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

హోమాలు.. పండరీభజనలు

మర్రిపాడు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను పురస్కరించుకుని మండలం డీసీపల్లిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీపల్లికి చెందిన చింతలపల్లి లక్ష్మీనరసయ్య, మధుసూదనశాస్త్రి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండరీ భజన బృందంతో రాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

జై శ్రీరామ్ నామస్మరణతో పులకింత



అప్పారావుపాలెంలో ఆంజనేయస్వామి దేవస్థానం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కొలువైన రామాలయాల్లో సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి సీతారాముల విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని అప్పారావుపాలెంలో ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షలతో నిర్మించనున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన మహిళలు, యువకులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: రామాలయంలో అయోధ్యలోని ప్రతిష్ఠా కార్యక్రమాలు వీక్షిస్తున్న భక్తులు



మర్రిపాడు: కోలాటం నిర్వహిస్తున్న భక్త బృందం



మహిమలూరు రామాలయం వద్ద భక్తుల కోలాహలం



కావలి: సీతారాముల వేషధారణలో చిన్నారులు, మహిళల శోభాయాత్ర

వైభవంగా శ్రీరాముడి శోభాయాత్ర



కలిగిరి: శ్రీరామచంద్రుడి శోభాయాత్రలో పల్లకి మోస్తున్న సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి

కలిగిరి: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సమయంలో కలిగిరిలో శ్రీరామచంద్రుడి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆయన కుమారుడు అభినవ్‌రెడ్డి స్వామివారి పల్లకిని మోసి పూజలు చేశారు. కలిగిరిలో పర్వతవర్ధిని నాగమల్లేశ్వరస్వామి ఆలయం, కలిగిరమ్మ తల్లి ఆలయం, కోదండరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారమే ప్రతిపక్షాల దినచర్య

- అభివృద్ధిని చూడలేని కబోదులు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



బీటీరోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రతిపక్షాలు అభివృద్ధిని చూడలేని కబోదులని, ఓ వైపు అభివృద్ధి పనులు జరుగుతున్నా దుష్ప్రచారమే దిన చర్యగా పెట్టుకున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. పట్టణంలోని 1వ వార్డు మద్దూరుపాడులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులు జరుగుతున్నా టీడీపీ, దాని తోక పార్టీలకు కనిపించవన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డుకు రూ.40 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వార్డు ప్రజల అభీష్టం మేరకు తారు రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఏ ప్రభుత్వం కూడా మంత్రాలతో సమస్యలు పరిష్కరించవని, నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికలతోనే ప్రాధాన్యతలు వారీగా సమస్యలు పరిష్కరించడానికి నిధులు కేటాయిస్తాయనే ఇంగిత జ్ఞానం కూడా లేకపోవడం శోచనీయమని ఎమ్మెల్యే మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కావలి నియోజకవర్గంలోనే రూ.2,500 కోట్లతో ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కేటాయించారన్నారు. ఇవి కాకుండా వందలు, వేల రూ.కోట్లతో నిర్మితమైన రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వచ్చే నెల్లో ప్రారంభమవుతాయన్నారు. కావలి నియోజకవర్గంలో ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రైతుల భూముల విలువ భారీగా పెరుగుతుందన్నారు. ఇవన్నీ కూడా టీడీపీ నాయకులు ఈర్ష్యతో అభివృద్ధిగా చూడడానికి, చెప్పడానికి అంగీకరించడం లేదన్నారు. చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కేవలం అబద్ధాల పునాదులపైనే తమకున్న మీడియా ద్వారా ప్రజలను మభ్యపెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే దుర్మార్గమైన పోకడలనే నమ్ముకోవడం వల్లనే నిజాలు చూడలేకపోతున్నారని, మాట్లాడలేకపోతున్నారన్నారు. నయవంచకులైన టీడీపీ నాయకులకు నీచమైన ప్రచారాలు ఉధృతంగా చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసన్నారు. కేవలం రెండు నెలల్లో జరిగే ఎన్నికలతో టీడీపీని ప్రజలే శాశ్వతంగా భూస్థాపితం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వేణుగోపాల్, చెన్ను ప్రసాద్‌రెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, పరుసు మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

శ్రీకొలను సబ్ కెనాల్‌కు నీటి విడుదల



శ్రీకొలను సబ్‌కెనాల్‌కు సోమశిల జలాలు విడుదల చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి

కలిగిరి: ఉత్తర కాలువ నుంచి శ్రీకొలను సబ్ కెనాల్‌కు సోమవారం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సాగు నీటిని విడుదల చేశారు. కలిగిరి సమీపంలోని ఉత్తర కాలువ వద్ద సోమశిల జలాలకు పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న వరి, పొగాకు, మిరప తదితర పంటలకు ఈ నీరు ఎంతో ఉపయోగకరమన్నారు. ఉత్తర కాలువకు సోమశిల జలాలను విడుదల చేయించిన సమన్వయకర్త మేకపాటికి ప్రత్యేక అభినందనలు చెబుతూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ములకా శ్రీనివాసులురెడ్డి, దగ్గుమాటి ఆదిశేషారెడ్డి, జిల్లా ప్రచార ప్రధాన కార్యదర్శి అంకినపల్లి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



పురిణి నాయకులతో ఎమ్మెల్యే రామిరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి

అల్లూరు: 2024లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యం వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పని చేయాలని ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి కోరారు. మండలంలోని పురిణిలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, మన ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు తెలిపాలన్నారు. గత ప్రభుత్వంలో 600 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చని వైనాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్, తాండ్ర మల్లికార్జున, వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది రాకుండా చూస్తాం

- ఎంపీపీ తూమాటి



చేజర్ల: మండలంలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తామని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. పలువురు సభ్యులు లేవనెత్తిన సమస్యలపై ఆయన స్పందిస్తూ వీలైనంత త్వరితంగా పరిష్కరిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జల్‌జీవన్ పథకం ద్వారా చేజర్ల, మడపల్లి గ్రామాలకు త్వరలో తాగునీరందిస్తామన్నారు. ఇప్పటికే పెన్నానది వద్ద బోర్ పాయింట్లు వేశారని, పనులు కూడా త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారు. జగనన్న కాలనీలు త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో కరెంట్ సమస్యపై ఇప్పటికే సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు ప్రతిపాదించామన్నారు. అయితే సమావేశానికి విద్యుత్ అధికారులు హాజరుకాక పోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమశిల దక్షిణ కాలువ ద్వారా చెరువులకు నీరు వదలాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తిరుపతి నాయుడు, గుమ్మా ప్రభావతి, ఎంపీడీఓ ఎస్కే కరిముల్లా, డీటీ విజయ్, ఈఓపీఆర్డీ రామయ్య, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరయ్యారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాలలో పని చేసి పదవీ విరమణ పొందిన, బదిలీ అయిన ఉపాధ్యాయులు పలు సామగ్రిని అందజేశారు. పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కె.నాగవేణి, రూ.10 వేలు, సైన్సు టీచరుగా పని చేసి బదిలీపై వెళ్లిన టీ రజని రూ.10 వేలు, పాఠశాల సిబ్బంది రూ.25 వేలు విరాళాలతో పాఠశాలకు అవసరమైన బీరువా, తరగతి గదులకు అవసరమైన 8 టేబుల్స్ తయారు సోమవారం హెచ్‌ఎం ఓ వెంటేశ్వరరావుకు అందజేశారు. 10వ తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ నారే శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు ఏలూరి మాల్యాద్రినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటి సహకారంతో అభివృద్ధి పనులు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

సోమశిల: అనంతసాగరం మండలంలోని 16 సచివాలయాల్లో ప్రజలు కోరిన వెంటనే మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిధులు మంజూరు చేయిస్తున్నారని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ తెలిపారు. సోమవారం దేవరాయపల్లి, ముత్తుకూరు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో ఎంపీపీ గడపగడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా మంజూరైన నిధులతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పాతదేవరాయపల్లికి రూ.16.50 లక్షలు, రూ.10 లక్షలు ఎమ్మెల్యే గ్రాంట్, ముత్తుకూరుకు రూ.8.12 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేయిస్తున్నారు. దేవరాయపల్లి సచివాలయం పరిధిలో మొత్తం రూ.55 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సీహెచ్ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తిరుపతిబాబు, మస్తానయ్య, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.